క్లుప్తంగా

శ్రీనివాసరావుకు సత్కారం



శ్రీనివాసరావును సత్కరిస్తున్న నియోజకవర్గ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ తదితరులు

అమలాపురం రూరల్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తూ ముమ్మిడివరం, మండపేట నియోజకవర్గాల పార్టీ పరిశీలకుడిగా నియమితులైన చెల్లుబోయిన శ్రీనివాసరావును వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ అభినందనలు తెలిపారు. భట్నవిల్లిలో మాజీ మంత్రి విశ్వరూప్ నివాసంలో ఆదివారం శ్రీనివాసరావును శాలువతో సత్కరించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో పట్టణ, మండల పార్టీ అధ్యక్షుడు సంసాని చంద్రశేఖర్, గుత్తుల చిరంజీవిరావు, బద్రి బాబ్జి, కొనుకు బాపూజీ, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు మిండగుదిటి శిరీష్, ఐటీ విభాగం అధ్యక్షుడు తోరం గౌతమ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్, జిల్లా అధికారి ప్రతినిధి సూదా గణపతి, నాయకులు పినిపే జయరాజు, కుడిపూడి భరత్‌భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం

ఐ.పోలవరం: భాద్రపద మాసం పౌర్ణమి ఆదివారం మహా పర్వదినం పురస్కరించుకుని మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో చండీహోమం ఘనంగా నిర్వహించారు. అర్చకులు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తొలుత గణపతి పూజ, మండపారాధన అనంతరం చండీహోమం, పూర్ణాహుతి జరిపారు. ప్రతి నెలా పౌర్ణమి తిథికి భక్తుల గోత్రనామాలతో దేవస్థానం తరఫున చండీహోమం నిర్వహించారు. 91 మంది భక్తులు చండీహోమంలో పాల్గొన్నారు. హోమానికి సంబంధించి ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వి.సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆకొండి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు క్షీరాభిషేకం

తాళ్లరేవు: భాద్రపద పౌర్ణమి పర్వదినం సందర్భంగా పి.మల్లవరం గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. అమ్మవారికి ధూళిపూడి సుబ్బారావు, పద్మావతి దంపతులతో అమ్మవారికి క్షీరాభిషేకం, ప్రత్యేక కుంకుమపూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉంగరాల బూరిబాబు, ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

భారీ అన్నదానం

తాళ్లరేవు: గణపతి నవరాత్ర మహోత్సవాలు ఘనంగా ముగిసిన నేపథ్యంలో ఉప్పంగలలో ఆదివారం భారీ అన్నదానం నిర్వహించారు. స్థానిక రామాలయం వద్ద ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ శాకా శంకరుడు ప్రారంభించారు. 11 ఏళ్లుగా వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు వెయ్యి మంది భక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో లచ్చిపాలెం సొసైటీ మాజీ అధ్యక్షుడు దవులూరి శ్రీరామ్మూర్తి, వీరబాబు ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

200 మందికి నేత్ర పరీక్షలు

యానాం: పట్టణ పరిధిలోని సుబ్రహ్మణ్య భారతి వీధిలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరంలో 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్దాని దినేష్, కాటంశెట్టి రామ్మూర్తి ఆధ్వర్యంలో కిరణ్‌కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యురాలు ప్రత్యూష రోగులకు పరీక్షలు నిర్వహించారు. రక్తపరీక్షలు, క్యాటరాక్ట్ క్లీనింగ్, మధుమేహ, స్కానింగ్ తదితర పరీక్షలను సుమారు 200 మందికి పరీక్షల చేశారు. 60 మందికి నేత్ర సంబంధిత వ్యాధులు, కంటిలో శుక్లాలకు సంబంధించి క్యాటరాక్ట్ ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చెక్కల అరుణ్‌కుమార్, తిరుకోటి ఆదిమూర్తి, రాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ అర్హత పరీక్ష నిర్వహించాలి

యానాం: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఉపాధ్యాయులు ఉపాధ్యాయ అర్హత పరీక్ష టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్) ఉత్తీర్ణత కావాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణం టెట్ పరీక్ష నిర్వహించాలని ఆదివారం నేషనల్ టీచర్స్ అసోసియేషన్ పుదుచ్చేరి శాఖ అధ్యక్షుడు పట్నా, ప్రధాన కార్యదర్శి దీపక్‌లు ఎల్జీ కె.కైలాశనాథన్, సీఎం రంగసామికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉచిత, నిర్బంధ ప్రాథమిక విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయులు తప్పనిసరిగా టెట్ పరీక్ష పాస్ కావాలని 2011లో అమలులోకి తీసుకువచ్చిందన్నారు. అప్పటి నుంచి టెట్ ఉత్తీర్ణత చెందిన వారినే టీచర్స్‌గా నియమిస్తుంది. అయితే 2011 తర్వాత పదోన్నతి పొందిన టీచర్స్, అంతకుముందు చేరిన టీచర్స్ అందరూ 2 సంవత్సరాల్లోగా టెట్ తప్పనిసరిగా పాస్ కావాలని లేనట్లయితే ఉద్యోగాలు కోల్పోతారని పేర్కొందని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకుని పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్ రీజియన్లలో టెట్ నిర్వహించాలని లేనట్లయితే తమిళనాడు టెట్ పరీక్ష రాయడానికైనా అనుమతించాలని కోరారు.

ఆదాయమున్నా.. సౌకర్యాలు సున్నా

- ఏటా రూ.కోటి ఆదాయం
- ఇదీ అమలాపురం సర్క్యులర్ బజార్ షాపింగ్ కాంప్లెక్స్ దుస్థితి
- మరుగుదొడ్ల సౌకర్యం లేదు
- పలు చోట్ల పెచ్చులు ఊడిపోతూ శిథిలావస్థకు చేరుకుంటున్న షాపింగ్ కాంప్లెక్స్



అమలాపురంలోని పొట్టి శ్రీరాములు సర్క్యులర్ బజార్ షాపింగ్ కాంప్లెక్స్

అమలాపురం టౌన్: పట్టణం నడిబొడ్డులో ఉన్న పొట్టి శ్రీరాములు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ (సర్క్యులర్ బజార్)లో నెలకొన్న అసౌకర్యాలతో లీజుదారులు అవస్థలు పడుతున్నారు. పట్టణం మొత్తం మీద మున్సిపాలిటీకి 74 షాపులతో ఉన్న అతి పెద్ద కాంప్లెక్స్ ఇది. ఈ షాపుల ద్వారా మున్సిపాలిటీకి ఏటా దాదాపు రూ.కోటి ఆదాయం వస్తోంది. అయినా లీజుదారులైన వ్యాపారులకు మున్సిపాలిటీ కనీస అవసరాలైన తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించలేకపోతోంది. 74 షాపులతో ఉన్న ఈ అతిపెద్ద షాపింగ్ కాంప్లెక్స్ నుంచి మున్సిపాలిటీ నెలకు షాపుల నుంచి రూ.8 వేల నుంచి రూ.15 వేల వరకూ లీజు వసూలు చేస్తోంది. ఇటీవల ఈ కాంప్లెక్స్‌లో పలు షాపుల లీజుదారులు సక్రమంగా అద్దెలు చెల్లించడం లేదని, బకాయిలు ఉన్న షాపులపై మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్, మున్సిపల్ రెవెన్యూ అధికారి భూపతి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అద్దెలు చెల్లించని కొన్ని షాపులకు తాళాలు వేసి సీజ్ చేశారు. ఈ సమయంలోనే కొందరు లీజుదారులు మున్సిపల్ అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. సర్క్యులర్ బజారు షాపులకు ఒకడుగు ఆలస్యమైనా అద్దెలు చెల్లిస్తున్నాం. మున్సిపాలిటీ మాత్రం మాకు తగిన సౌకర్యాలు కల్పించలేకపోతోందని అధికారుల ఎదుటే అసహనం వ్యక్తం చేశారు. షాపులకు మరుగుదొడ్ల సౌకర్యం లేదు. కాలకృత్యాలు అనివార్యమైతే ప్రత్యామ్నాయ మార్గాల్లో ఆ అవసరాలు తీర్చుకుంటున్నాం. షాపులకు తాగునీటి సౌకర్యం కూడా లేదు. గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తుతో ఉన్న ఈ కాంప్లెక్స్‌లో పలు షాపులకు పెచ్చులు ఊడిపోయి శిథిలావస్థకు చేరుకుంటున్నా కనీసం మరమ్మతులు కూడా చేయించడం లేదని అధికారుల ఎదుట లీజుదారులైన వ్యాపారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. 1998లో నిర్మించిన ఈ భారీ షాపింగ్ కాంప్లెక్స్‌లో పలు అసౌకర్యాలు తిష్ట వేసినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు.

కౌన్సిల్ సమావేశాల్లో మొర పెట్టినా..

ఇటీవల కాలంలో జరుగుతున్న పలు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో కౌన్సిలర్లు సర్క్యులర్ బజార్‌లో నెలకొన్న అసౌకర్యాలపై మొర పెడుతూనే ఉన్నారు. పాలకపక్ష కౌన్సిలర్ గొవ్వాల రాజేష్ అయితే గత రెండు నెలల్లో జరిగిన రెండు సమావేశాల్లో సర్క్యులర్ బజారులో మరుగుదొడ్ల సౌకర్యాలను కల్పించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. కౌన్సిలర్లు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోరా..? అంటూ అధికారులపై ధ్వజమెత్తారు. ఎట్టకేలకు ఇటీవల కమిషనర్ నిర్మల్‌కుమార్ ఆ కాంప్లెక్స్‌ను స్వయంగా పరిశీలించినప్పుడు అసౌకర్యాలు ఏ స్థాయిలో ఉన్నాయో కళ్లారా చూశారు. ఎంత సేపూ రెవెన్యూ విభాగం లీజుదారుల నుంచి అద్దెలు వసూలు చేసే విషయంపైనే దృష్టి పెట్టింది గాని, ఆ షాపింగ్ కాంప్లెక్స్‌లో జటిలమవుతున్న అసౌకర్యాల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపలేదు. ఈ కాంప్లెక్స్ ద్వారా ఏటా రూ.కోటి ఆదాయం వస్తున్నా సౌకర్యాల కల్పన దిశగా ఆలోచించకపోవడం వల్లే నేడు ఇన్ని ప్రతికూల పరిస్థితులు, లీజుదారుల నుంచి అసంతృప్తి మాటలు అనివార్యమవుతున్నాయి.

అంచనాలు రూపొందించేందుకు ఆదేశాలు

సర్క్యులర్ బజార్ షాపింగ్ కాంప్లెక్స్‌లో బాత్ రూమ్‌లు సౌకర్యాల లేని మాట వాస్తవం. అలాగే షాపింగ్ కాంప్లెక్స్‌లో కొన్ని మరమ్మతులు చేపట్టి మొత్తం ఆధునీకరించాల్సి ఉంది. అలాగే కాంప్లెక్స్‌కు రంగులు కూడా వేయిస్తాం. మున్సిపాలిటీ ఇంజినీరింగ్ విభాగంచే ఈ పనులకు అంచనాలు తయారు చేయాలని ఆదేశాలు ఇచ్చాం. త్వరలోనే సర్క్యులర్ బజార్ ఆధునీకరణకు త్వరలోనే చర్యలు చేపడతాం.

– వి.నిర్మల్‌కుమార్, కమిషనర్, అమలాపురం మున్సిపాలిటీ

స్కామ్ చేసేందుకే యూరియా కొరత

- వైఎస్సార్ సీపీ కోర్డినేటర్ పినిపే డాక్టర్ శ్రీకాంత్
- రేపు ఆర్డీవో కార్యాలయం వద్ద అన్నదాత పోరు పోస్టర్ల ఆవిష్కరణ



అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్, ఎమ్మెల్సీలు, నాయకులు

అమలాపురం రూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం యూరియా కృత్రిమ కొరత సృష్టించి రూ.వేల కోట్లను స్కామ్ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసిందని వైఎస్సార్ సీపీ కోర్డినేటర్ పినిపే డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. రైతులకు మద్దతుగా వైఎస్సార్ సీపీ రైతు విభాగం అధ్వర్యంలో మంగళవారం అమలాపురం ఆర్డీవో కార్యాలయం వద్ద జరిగే అన్నదాత పోరు నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ పార్లమెంట్ కోఆర్డినేటర్ పినిపే విశ్వరూప్ స్వగృహం వద్ద ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాత పోరు నిరసన కార్యక్రమం పోస్టర్లను ఆదివారం శ్రీకాంత్, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావుతో కలసి ఆవిష్కరించారు. అన్నదాత పోరుపై కార్యకర్తలు, నాయకులతో కలసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు రాయితీపై సరఫరా చేయవలసిన యూరియాను టీడీపీకి చెందిన వ్యాపారులకు ఆధార్ కార్డు ద్వారా చేరవేస్తున్నారు. రైతులకు వ్యవసాయ భూమి ఉన్న పట్టాదారు పాస్ బుక్ ద్వారా అధికారులు ఎరువులు సరఫరా చేయవలసి ఉండగా ఇందుకు భిన్నంగా వ్యాపారులు ఆధార్ కార్డు ద్వారా వస్తున్న యూరియాను దిగుమతి చేసుకొని బస్తాకు 200 చొప్పున బ్లాక్ మార్కెట్లో అమ్ముకుంటుందన్నారు. మాజీ మంత్రి విశ్వరూప్ నివాసం వద్ద నుంచి రైతు పోరుకు నాయకులు, రైతులు ఆర్డీవో కార్యాలయాలనికి బైక్ ర్యాలీగా తరలి వెళ్లాలన్నారు. ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడుతూ రైతులను చంద్రబాబునాయుడు చులకన చేస్తున్నారన్నారు. రైతులకు బీమా పథకాన్ని ప్రభుత్వ డబ్బులు కట్టే విధానాన్ని తొలగించారని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు సంసాని చంద్రశేఖర్, గుత్తుల చిరంజీవిరావు, బద్రి బాబ్జి, కొనుకు బాపూజీ, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, జిల్లా ఐటీ విభాగం అధ్యక్షుడు తోరం గౌతమ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్, జిల్లా అధికారి ప్రతినిధి సూదా గణపతి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత పోరుకు అనుమతి కోరిన నేతలు

అమలాపురం టౌన్: స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించనున్న వైఎస్సార్ సీపీ అన్నదాత పోరు నిరసన కార్యక్రమానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ నియోజకవర్గ పార్టీ నాయకులు డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్‌కు అనుమతి పత్రాన్ని ఆదివారం అందించారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు డీఎస్పీ ప్రసాద్‌ను కలసి అనుమతి కోరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్, పార్టీ నాయకుడు కల్వకొలను ఉమ తదితరులు డీఎస్పీని కలసిన వారిలో ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం



ఇంజరంలో పారిశుద్ధ్య కార్మికులను సత్కరిస్తున్న వెంకటరావు దంపతులు

తాళ్లరేవు: ఇంజరంలో కుమార్తె జ్ఞాపకార్థం కాకరపర్తి వెంకటరావు, పూర్ణిమ దంపతుల నేతృత్వంలో కేవీఆర్ అంజలి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. స్థానిక ప్రాథమిక పాఠశాలలో కాకినాడ ట్రస్ట్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.ఎస్‌సీహెచ్ఎస్ రామకృష్ణ ప్రారంభించారు. ఆస్పత్రి వైద్యులు ఎం.ఫణిరమణ భూషణ్, డా.సానా ప్రవీణ్, బి.దుర్గా పవన్ కుమార్‌లు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుగరు, బీపీ, ఈసీజీ, గుండె స్కానింగ్ తదితర సేవలను ఉచితంగా అందజేశారు. అనంతరం గ్రామ పరిశుభ్రత కోసం నిరంతరం పాటుపడే పది మంది పారిశుద్ధ్య కార్మికులను వెంకట్రావు దంపతులు దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందించారు. వెంకటరావు మాట్లాడుతూ తమ ఏకైక కుమార్తె దివంగత అంజలి పుట్టినరోజును పురస్కరించుకుని ఏటా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వెంకట్రావు దంపతులు చేస్తున్న సేవా కార్యక్రమాలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ముద్దన వెంకట శివరామ ప్రసాద్, మాజీ సర్పంచ్ ఆకెళ్ల సుబ్బారావు, ట్రస్ట్ ఆస్పత్రి హెచ్ఆర్ మేనేజర్ ఓఆర్ ప్రసాద్, నాయకులు ఆకెళ్ల నాగేశ్వరరావు, వేగేశ్న భాస్కరరాజు, దుడ్డు సూర్యనారాయణమూర్తి, ద్విభాష్యం నగేష్‌బాబు, చేదూరి అరవింద్, కేసాప్రగడ కృష్ణమూర్తి, వీరపండు, బాబీశర్మ, రామకృష్ణ తదితర నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేత



అందుకున్న ప్రోత్సాహకాలతో విద్యార్థులు, లయన్స్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లయన్స్ సెంటినియల్ విద్యా ప్రోత్సాహకాల (స్కాలర్ షిప్‌లు) పంపిణీ స్థానిక దుడ్డివారి అగ్రహారంలోని బంగారు, వెండి వర్తకుల సంఘం భవనంలో ఆదివారం జరిగింది. లయన్స్ జిల్లా ప్రతినిధి అనిల్‌కుమార్ జైన్ ఆధ్వర్యంలో విద్యా ప్రోత్సాహక ట్రస్ట్ చైర్మన్ బీవీఎస్ రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించారు. అమలాపురం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సూదా గణపతి అధ్యక్షతన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ జరిగింది. ఆయన మాట్లాడుతూ గత ఎనిమిదేళ్లుగా ఎంతో మంది పేద విద్యార్థులకు రూ.1.29 కోట్ల కార్పస్ ఫండ్‌ను 106 మంది ట్రస్ట్ సభ్యులుగా ఏర్పడి ఆ మొత్తం ద్వారా వచ్చే వడ్డీ సొమ్ములను అందిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా అమలాపురంలో 80 మంది విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, నగదు ప్రోత్సాహకాలు అందించినట్లు బీవీఎస్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి పెద్దిరెడ్డి ఉమామహేశ్వరరావు, కోశాధికారి డి.రమా సుబ్రహ్మణ్యం, లయన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పురోహితుడు ‘నాగాభట్ల’కు సన్మానం



నాగాభట్ల రామకృష్ణ మూర్తిని సత్కరిస్తున్న ఆపస్తంభ పురోహిత్ సభ్యులు

ఐ.పోలవరం: సుదీర్ఘ కాలంగా పురోహిత వృత్తిలో ఉన్న మురమళ్ల గ్రామ పురోహితుడు, భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి దేవస్థానం పురోహితుడు బ్రహ్మశ్రీ నాగాభట్ల రామకృష్ణమూర్తి (రమేష్)ని ఎంపిక చేసి ఘనంగా సన్మానించారు. ‘ఆపస్తంభ పురోహిత్’సంస్థను ఏర్పాటు చేసి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా భాద్రపద పౌర్ణమి నాడు ఆ సంస్థ ఘనంగా సన్మానించింది. అమలాపురం కూచిమంచి వారి అగ్రహారం శంకరమఠంలో జరిగిన ఈ సభలో ఐ.పోలవరం మండలం నుంచి రామకృష్ణ మూర్తిని ఎంపిక చేసి సన్మానించారు. రామకృష్ణ మూర్తి పల్లిపాలానికి చెందిన బ్రహ్మశ్రీ తాతపూడి రామకృష్ణ అవధానుల వద్ద చిన్నప్పుడే స్మార్థ విద్య పూర్తి చేశారు. మురమళ్ల గ్రామ పురోహితుడిగా అలాగే 2004లో నిత్య కల్యాణం పచ్చ తోరణంగా విరాజిల్లుతున్న భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయ పురోహితుడిగా విధులు నిర్వహిస్తున్నారు. వైదిక వృత్తిలో ఉంటూ పలు వైదిక కార్యక్రమాలు జరిపించారు. వీరి సేవలను గుర్తించి అమలాపురం పురోహిత సంఘం ఘనంగా సన్మానించింది.

నవంబర్‌లో ఫ్రెంచి చలన చిత్రోత్సవం

యానాం: విద్య, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడంలో భాగంగా ఫ్రాన్స్ ప్రభుత్వం ఆధ్వర్యంలో అలయన్స్ ఫ్రాంకైస్ ది పాండిచ్చేరి ఫ్రెంచి స్కూల్ ఆధ్వర్యంలో యానాంలో ఫ్రెంచి భాషా కోర్సులను ప్రవేశపెట్టేందుకు నిర్ణయించారని ఆదివారం యానాంలో ఫ్రెంచి పౌరుల ప్రతినిధి సాధనాల బాబు ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా ముందు ఒక ప్రభుత్వ, ఒక ప్రైవేట్ స్కూల్‌ను ఎంపిక చేసుకుని పైలట్ ప్రాజెక్టుగా అక్టోబర్ నుంచి తరగతులు ప్రారంభించాలని భావిస్తున్నారని తెలిపారు. దీనిలో భాగంగా ఈ లక్ష్యసాధనలో ముందుగా ఆసక్తి, నాణ్యత తదితర వాటి గురించి తెలుసుకుంటున్నట్లు తెలిపారు. అదే విధంగా యానాంలో ఈ ఏడాది నవంబర్ నెల మధ్యలో ఫ్రెంచి చలన చిత్రోత్సవాన్ని నిర్వహించడానికి సైతం ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ సాంస్కృతిక కార్యక్రమం ఇండో–ఫ్రెంచ్ సంబంధాలను బలోపేతం చేయడం, అంతర్జాతీయ సాంస్కృతిక మార్పిడిని ప్రోత్సహించడంతో పాటు యానాం ప్రజలకు ఫ్రెంచి సినిమా, సంస్కృతి గొప్పతనాన్ని చూపేందుకు ఒక గొప్ప అవకాశంగా భావిస్తున్నారన్నారు. దీనిలో భాగంగా అలయన్స్ ఫ్రాంకైస్ ఫ్రెంచి స్కూల్ నుంచి ఐదుగురు ప్రతినిధులు రీజినల్ అడ్మినిస్ట్రేటర్, యానాం విద్యాశాఖ, ఉన్నతాధికారులతో అనుమతులకు ఈనెల 8న సమావేశం జరుపుతున్నట్లు తెలిపారు.

ఆహార నియమాలతోనే ఆరోగ్యం



ఆరోగ్య అవగాహన సదస్సుకు హాజరైన ప్రజలు

అమలాపురం టౌన్: మనం ఎంత వ్యాయామం చేసినా సరైన ఆహార నియమాలు పాటించకపోతే శరీరానికి తగిన లబ్ధి చేకూరదని ప్రకృతి జీవన విధాన ఆరోగ్యాభిలాషి డాక్టర్ మంతెన సత్యనారాయణరాజు అన్నారు. ఆలోచన, ఆచరణ ఉంటే ఆరోగ్యం మన చెప్పు చేతల్లోనే ఉంటుందన్నారు. అమలాపురం ఓం శాంతి కేంద్ర కార్యాలయం (బ్రహ్మకుమారీస్ హార్మోని హౌస్)లో ఆ కేంద్రం ఇన్‌చార్జి బీకే శ్రీదేవి అధ్యక్షతన ఆదివారం జరిగిన హెల్త్ అండ్ వెల్త్ అవగాహన సదస్సులో డాక్టర్ సత్యనారాయణరాజు మాట్లాడారు. ఆహార పరంగా మంచి అలవాట్లకు మించిన మందు లేదని ఆయన హితవు పలికారు. ఆరోగ్యానికి అడ్డదారులు లేవని, ఎర్లీ డిన్నర్ ఫస్ట్ ప్రిన్సిపుల్‌గా పాటిస్తే సరిపోతుందని చెప్పారు. మన శరీరం ఆటోమేటిక్‌గా అన్నీ చేయగలదని, రిపేర్‌క్లీనింగ్ మెకానిజం మనలోనే ఉంటుందని వివరించారు. ఆలోచన బట్టే ఆకలి వేస్తుందని, తద్వారా హార్మోన్ బ్యాలెన్స్ జరుగుతుందన్నారు. సాత్విక ఆహారం తింటే ఆరోగ్యం మీ వెంటే పరుగు పెడుతుందని చెప్పారు. మనిషికి ఆరోగ్యం, భక్తి ఎంత అవసరమో ధ్యానం కూడా అంతే అవసరమని గుర్తు చేశారు. అందుకే నేడు ప్రధానమంత్రి నుంచి అన్ని పార్టీల రాజకీయ ప్రముఖులు ధ్యానం వైపు అడుగులు వేస్తున్నారన్నారు. ధ్యాన మార్గాన్ని అన్వేషిస్తే మనిషిలోని ఒత్తిడి మాయమై ఆరోగ్యం సిద్ధిస్తుందని సత్యనారాయణరాజు వివరించారు. ఆరోగ్య సదస్సులో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్రహ్మకుమారీస్ ఇన్‌చార్జి బీకే రజని, బ్రహ్మకుమారి స్వరూప, పలువురి ప్రముఖులతో పాటు వైద్యులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భీమారావుకు జ్ఞాన పురస్కార్ అవార్డు

అమలాపురం రూరల్: సొసైటీ ఆఫ్ ఇండియా బుద్ధిస్ట్ సొసైటీ, అమలాపురం త్రిరత్న బుద్ధ విహార్ అధ్వర్యంలో అత్యుత్తమ ప్రతిభ కలిగిన గురువులకు సామాజిక వ్యక్తులకు బహూకరించే జ్ఞాన పురస్కార్ అవార్డును కవి, సామాజిక వేత్త విద్యావేత్త సమగ్రశిక్షలో అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎంఏకే భీమారావుకు అందించారు. భీమారావు విద్యాశాఖలో ఎందరో విద్యార్థుల భవిష్యత్ నిర్మాణానికి, తన మోటివేషనల్ స్పీచ్‌తో వారి కెరీర్ గైడెన్స్‌కు జిల్లాలో అత్యంత స్ఫూర్తిదాయకంగా పనిచేయడాన్ని గుర్తించి ఈ జ్ఞాన పురస్కార అవార్డు అందించారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చేతుల మీదుగా మమత స్వచ్ఛంద సేవా సంస్థ అన్నా మినిస్ట్రీస్ అందజేసిన విశిష్ట సేవా పురస్కారాన్ని ఆయన ఇటీవల ఆయన అందుకున్నారు. కోనసీమ బీఎస్ఐ ప్రతినిధులు డీబీ లోక్, కాశీరామ్ బోది, కాశీ వెంకట్రావు, ములపర్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

అమెరికా పెత్తనంపై నిరసన

అమలాపురం టౌన్: సుంకాల పేరుతో మన దేశంపై అమెరికా పెత్తనాన్ని నిరసిస్తూ అమలాపురం గడియారం స్తంభం సెంటర్‌లో వామపక్షాల జిల్లా నాయకులు ఆదివారం ధర్నా నిర్వహించారు. భారతదేశాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదే పదే బెదిరిస్తున్న ప్రధాని మోదీ నోరు మెదపడం లేదని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు ధ్వజమెత్తారు. ట్రంప్ పెత్తనాన్ని, ప్రకటనలను వామ పక్షాల నాయకులు ఖండించారు. ట్రంప్ ప్రకటనలను దేశ ప్రధాని ఖండించకపోవడంపై వారు నిరసన తెలిపారు. ధర్నాలో వామపక్షాల నాయకులు భీమాల శ్రీనివాస్, కె.శంకర్, జి.దైవమణి, పి.అలేఖ్య, కె.ఈశ్వర్, జి.రమణ, నాగరాజు, నాగబాబు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ అధరహో



గణపతి లడ్డూను రూ.1.60 లక్షలకు దక్కించుకున్న పంజాబి ధాబా ప్రతినిధులు

తాళ్లరేవు: సుంకరపాలెం బైపాస్ జంక్షన్‌లోని లక్ష్మీ గణపతి వరసిద్ధి వినాయక వర్తక సంఘం లడ్డూ రూ.1.60 లక్షల ధర పలికింది. వర్తక సంఘం ఆధ్వర్యంలో గణపతి నవరాత్ర మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన లడ్డూ పాటలో స్థానిక మాగాపు కాంప్లెక్స్‌లోని పంజాబీ ధాబా అధినేత బిజయ్‌కుమార్ సాహూ రూ.1.60 లక్షలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో లక్ష్మీ గణపతి వరసిద్ధి వినాయక వర్తక సంఘం అధ్యక్షుడు పాగాకు వాసు, ప్రతినిధులు పాల్గొన్నారు.

గణపతి లడ్డూకు రూ.33 వేలు

అమలాపురం టౌన్: స్థానిక కల్వకొలను వీధిలో బాల గణపతి యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటైన వినాయక చవితి చలువ పందిరిలో గణపతి విగ్రహం వద్ద ప్రసాదంగా ఉంచిన లడ్డూకు ఆదివారం వేలం నిర్వహించారు. శ్రీబాల గణపతి యువజన సంఘం నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల 33వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 33 కేజీల లడ్డూను గణపతి విగ్రహం వద్ద ఉంచారు. ఆ లడ్డూకు నిర్వహించిన వేలంలో తోట దేవీగణేష్ రూ.33 వేలకే పాడి సొంతం చేసుకున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



మండల ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ముమ్మిడివరం: మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారం అందుకున్న ఉపాధ్యాయులను ఆదివారం ఏపీ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎన్ మునేశ్వరరావు ఆధ్వర్యంలో పురస్కారం అందుకున్న మోర్త రాజశేఖర్, వి.చినరాజశేఖర్, ఎం.నాగభూషణంలను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ జీవీవీ సత్యనారాయణ, జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆలయాల మూసివేత

ముమ్మిడివరం: సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భం ఆదివారం మండలంలోని ప్రముఖ దేవాలయాలను మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూసివేశారు. ముమ్మిడివరం ఉమాసూరేశ్వరస్వామి, కొమానపల్లి పార్వతీ సమేత చోడేశ్వర, లోకేశ్వర స్వామి, అయినాపురం ఉమా సోమేశ్వరస్వామి, అన్నంపల్లి పార్వతీ గౌతమేశ్వరస్వామి, కొత్తలంక ఉమాభోగేశ్వరస్వామి, క్రాపచింతలపూడి ఉమావల్లభేశ్వరస్వామి, ఠాణేల్లంక ఉమాసోమేశ్వర స్వామి ఆలయాలను మూసివేసినట్లు ఆలయ పూజారులు తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటలకు ఆలయాలను తెరచి సంప్రోక్షణ అనంతరం ఆలయాల్లో యథావిధిగా భక్తులకు దర్శనాలు కల్పిస్తామని తెలిపారు.

వేంకటేశ్వరస్వామి దేవస్థానం మూసివేత

అమలాపురం టౌన్: సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా అమలాపురంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు మూసివేశారు. వెంకటేశ్వరస్వామికి సంప్రోక్షణ నిర్వహించి తిరిగి దేవస్థానాన్ని సోమవారం ఉదయం 8 గంటలకు తెరుస్తామని దేవస్థానం ఈవో యర్రా వెంకటేశ్వరరావు తెలిపారు. సంప్రోక్షణ అనంతరం స్వామి దర్శన ఏర్పాట్లు చేస్తామన్నారు.

గ్రహణంతో వీరేశ్వరుని ఆలయం మూసివేత

ఐ.పోలవరం: చంద్రగ్రహణం కారణంగా ఆదివారం రాత్రి భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయాన్ని మూసివేశారు. దేవస్థానం పంచాంగాన్ని ఆనుసరించి సాయంత్రం ఆలయాన్ని మూసివేసినట్టు అసిస్టెంట్ కమిషనర్, ఈవో వి.సత్యనారాయణ తెలిపారు. చంద్ర గ్రహణం కారణంగా ఆదివారం రాత్రి జరగాల్సిన కళ్యాణాలను సైతం రద్దు చేశామన్నారు. సోమవారం ఉదయం ఆలయ సంప్రోక్షణ అనంతరం ఉదయం ఎనిమిది గంటల నుంచి దర్శనాలు, అభిషేకాలకు అనుమతి ఇస్తామని ఈవో సత్యనారాయణ తెలిపారు.

అసెంబ్లీ నిర్మాణానికి రూ.699 కోట్లు

యానాం: పుదుచ్చేరి నూతన అసెంబ్లీ భవన నిర్మాణానికి కేంద్రప్రభుత్వం రూ.699 కోట్లు మంజూరు చేసిందని స్పీకర్ ఆర్.సెల్వం తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే భవనానికి సంబంధించి తుది డిజైన్ కూడా పూర్తయిందన్నారు. ప్రస్తుత పాత అసెంబ్లీ భవనం స్థానంలో నిర్మించే నూతన అసెంబ్లీ భవన నిర్మాణానికి తుది నివేదికను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపి ఆయన సంతకం అయిన తర్వాత కేంద్రానికి పంపినట్లు తెలిపారు. అదే విధంగా ప్రభుత్వ కార్యదర్శి ముత్తమ్మ సైతం ఈ భవన నిర్మాణానికి తీసుకోవలసిన దశల వారీ చర్యలు, నిధుల స్వీకరణ అనంతరం నిర్మాణానికి శిలాఫలకం వేస్తామన్నారు. అదే విధంగా రాష్ట్రహోదా కోసం అసెంబ్లీలో చర్చించనున్నట్లు తెలిపారు.

అవసరమైన యూరియా అందిస్తాం

కాట్రేనికోన: వరి రైతులకు అవసరమైన యూరియాను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అమలాపురం ఆర్డీఓ కె.మాధవి అన్నారు. పల్లంకుర్రు, చెయ్యేరు పంచాయతీల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. రానున్న 10 రోజుల్లో 160 టన్నుల యూరియాను సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బలక్ష్మి, మండల వ్యవసాయ అధికారి మృదుల, పల్లంకుర్రు సర్పంచి నాతి అలివేణి తదితరులు ఉన్నారు.